క్లుప్తంగా

10న రేణుకాదేవి విగ్రహ ప్రతిష్ట



రేణుకాదేవి అమ్మవారి విగ్రహం

కురుపాం: కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారం, ఆపదలో ఉన్నవారిని ఆదుకునే అమ్మవారిగా భక్తులచే పూజలందుకుంటున్న రేణుకాదేవి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఈ నెల 8,9,10 తేదీల్లో నిర్వహించనున్నట్లు నెల్లి శ్రీనివాసరావు, సరళ తెలిపారు. స్థానిక షిర్డీసాయి ద్వారకామయి ఆలయ ప్రాంగణలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట చేయనున్నట్లు పేర్కొన్నారు. 8న విఘ్నేశ్వర పూజ, ఆవాహనం, రేణుకాదేవి విగ్రహ తిరువీధి, కలశ యాత్ర, 9న ప్రత్యేక పూజలు, సామూహిక లలితా పారాయణం, హోమం, 10వ తేదీ శనివారం ఉదయం 7:35 నిమిషాలకు యంత్రం, విగ్రహ ప్రతిష్ఠాపన ఉంటాయన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

భామిని ఎంపీడీఓగా చంద్రరావు



భామిని: భామిని ఎంపీడీఓగా గుండెల చంద్రరావు బుధవారం విధుల్లో చేరారు. గురుగుబిల్లి మండలం ఏఓగా పని చేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈఓపీఆర్డీ జి.కృష్ణారావు నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



దోమతెరల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి ఫణికుమార్, అప్పారావు

భామిని: మండలం బొడ్డగూడ, కోటకొండ గిరిజన గ్రామాల్లో బుధవారం దోమల నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. ఆల్ఫా సైపర్ మైత్రిన్ 5 శాతం ద్రావణాన్ని వీధుల్లో పిచికారీ చేశారు. భామిని వైద్యాధికారి ఫణికుమార్ ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మలేరియా, డెంగీ వంటి వ్యాధులకు దోమలే కారణమని, దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలని సూచించారు. ఇంటి ఆవరణాలను శుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సబ్‌యూనిట్ అధికారి పి.అప్పారావు, సీహెచ్‌ఓ భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు బిడ్డిక అనంతరావు ఉన్నారు.

రైతు శ్రేయస్సు కోరే ప్రభుత్వం

పార్వతీపురంటౌన్: రైతు శ్రేయస్సుకోరే రైతు ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బుధవారం మండలంలోని నర్సిపురంలో రైతు భరోసా కేంద్రంలో రైతన్నలకు రాయితీపై వరి విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి రైతుల శ్రేయస్సు కోసం ఆర్బీకేల ద్వారా విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. విత్తనాల నుంచి పంట అమ్ముకునే వరకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుంటుందని చెప్పారు. ఆర్బీకేల్లో 1064, ఎంటీయూ1121, సాంబ, సోనామసూరి, ఆర్జీఎల్ తదితర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, వ్యవసాయాధికారుల సూచనల మేరకు సాగు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శోభారాణి, పీఏసీఎస్ చైర్మన్ కాపారపు సత్యనారాయణ, ఆత్మచైర్మన్ యాండ్రాపు తిరుపతిరావు, వైస్ ఎంపీపీ సిద్దా జగన్నాథరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మి రమేష్ వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సాగునీటి నిల్వ పెంచేందుకు ఉపాధి పనులు

సీతానగరం: మండలంలో రానున్న ఖరీఫ్‌సీజన్‌లో వర్షాధార పంట భూములకు చెరువుల్లో సాగునీటి నిల్వలు పెంపొందించడానికి ఉపాధిహామీ పథకం ద్వారా పనులు చేపడుతున్నామని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన మండలంలోని సూరంపేటలో గల కూర్మినాయుడు చెరువులో వేతనదారులు చేస్తున్న మట్టి పనులను సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనదారులతో ఉపాధిహామీ పనులు చేపట్టడం వల్ల వారికి ఉపాధి, ఆయకట్టు భూములున్న రైతులకు అత్యవసర పరిస్థితుల్లో సాగునీటి వినియోగానికి చెరువుల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకూ 280 చెరువుల్లో చెరువు గర్భాలను లోతు చేయడం వల్ల చెరువుగట్ల అభివృద్ధి, కల్వర్టుల నిర్మాణం, చప్టాల నిర్మాణం పూర్తి చేయడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు. నిర్ధారించిన పనులు పూర్తి చేసి వచ్చే ఖరీఫ్ సీజనుకు ఆయకట్టు భూములకు సమృద్ధిగా సాగునీరు సమకూర్చడానికి తమవంతు పనులు చేస్తున్నామని చెప్పారు. అలాగే పంట భూములలో రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ఇళ్లకు చేర్చడానికి అవసరమైన రోడ్లు అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు.

ప్రజల ముంగిటకే పాలన

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి
- ఉల్లిభద్రలో గ్రామ సచివాలయం, ఆర్‌బీకే భవనాల ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి



రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

గరుగుబిల్లి: ప్రజల ముంగిటకే అన్ని ప్రభుత్వ సేవలు, పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రూ.28.56 లక్షలతో నిర్మించిన రైతుభరోసా కేంద్రాన్ని బుధవారం వైఎస్సార్‌సీపీ పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చారని అన్నారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకువచ్చారన్నారు. ప్రతీ పంచాయతీ పరిధిలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి ప్రభుత్వ భవనాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. గతంలో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవల కోసం మండల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, రోజుల తరబడి నిరీక్షించినా పనులు జరిగేవికాదని గుర్తు చేశారు. నేడు గ్రామ సచివాలయాల ద్వారా సుమారు 545 ప్రభుత్వ సేవలను అందజేస్తున్నామన్నారు. అలాగే ఆర్బీకేల ద్వారా ఇంటి వద్దకే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ యంత్రపరికరాలను అందజేస్తున్నట్లు చెప్పారు. సుపరిపాలన అందిస్తున్న జగనన్నను 2024 ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించి ప్రజలందరూ ఆశీర్వదించాలని కోరారు. ఆయన గెలుపు లక్షలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణిని, పరీక్షిత్‌రాజులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపనీపీ ఉరిటి రామారావు, స్థానిక సర్పంచ్ ఎస్.దివ్యలక్ష్మి, వైస్ ఎంపీపీలు బి.లక్ష్మి, ఎన్.లక్ష్మి, ఎంపీటీసీ బి.గౌరమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.అప్పలనాయుడు, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు విత్తనాలు సిద్ధం

గరుగుబిల్లి: ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి రైతులకు అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి అన్నారు. ఉల్లిభద్ర ఆర్‌బీకేలో విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు విత్తనాలు అందివ్వడం నుంచి పండించిన పంటను కొనుగోలు చేసేవరకు అన్నీ ప్రభుత్వమే చూసుకుంటోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి మాట్లాడుతూ.. మండలంలోని 13 ఆర్‌బీకేలకు 2,260 క్వింటాళ్ల వరి విత్తనాలు కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో ఎంటీయూ-1064 రకం 1850 క్వింటాళ్లు, బీపీటీ 5204 రకం 200 క్వింటాళ్లు, ఎంటీయూ 7029 రకం 2010 క్వింటాళ్లు వచ్చాయన్నారు. కిలోకు రూ.10లు చొప్పున్న రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. అలాగే కట్టిజనుమ, జీలుగు విత్తనాలను 50శాతం రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

మూఢనమ్మకాలు వీడాలి: సీఐ



గిరిజనులతో మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ

గుమ్మలక్ష్మీపురం: మనుషులను మూర్ఖులుగా మార్చే మూఢనమ్మకాలు, చేతబడి వంటి అసాంఘిక చర్యలను వీడనాడాలని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ కోరారు. మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన బాలేసులో ఎస్సై షణ్ముఖరావుతో కలిసి మూఢనమ్మకాలపై బుధవారం అవగాహన కల్పించారు. పగ తీర్చుకునేందుకు అవతలి వ్యక్తికి హానిచేసేందుకు పూనుకోవడాన్నే చేతబడి అంటారని, అటువంటి చర్యలకు పాల్పడిన, ప్రోత్సాహించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. సారా తయారీ, అమ్మకం నేరమని, బాల్య వివాహాలు చేసినా, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై పోక్సో చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామన్నారు.

సమన్వయంతో పనిచేయాలి: ఎంపీపీ



వ్యవసాయశాఖ అధికారి నాగేశ్వరరావుతో మాట్లాడుతున్న ఎంపీపీ పద్మావతి

కురుపాం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివరామప్ప ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరు, మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. అధికారులు వారి శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలను సభ్యులకు వినించారు. వ్యవసాయశాఖ ద్వారా చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమాచారం ఇవ్వడం లేదని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఐసీడీఎస్, విద్యాశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన నాడు-నేడు పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, వాటిని వేగవంతం చేయాలని ఆయా శాఖల అధికారులకు ఎంపీపీ సూచించారు. సమావేశానికి ఐటీడీఏ ఏటీడబ్ల్యూఓ, ఎంఈఓ, విద్యుత్‌శాఖ, ఇతర శాఖలకు చెందిన పలువురు అధికారులు గైర్హాజరు కావడంతో ఎంపీపీ వారికి ఫోన్ చేసి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. పద్ధతి మార్చుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. పంచాయతీల్లో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో తహసీల్దార్ రమేష్‌కుమార్, వైస్ ఎంపీపీ అన్నాజీరావు, మండల కోఆప్షన్ సభ్యుడు జిలానీ, స్థానిక సర్పంచ్ గార్ల సుజాత, మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రజ్ఞా, ఏసీడీపీఓ రాజ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యత పాటించాలి



జియ్యమ్మవలస: తురకనాయుడువలసలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

జియ్యమ్మవలస: ఉపాధిపనులను నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు అన్నారు. తురకనాయుడువలసలో ఉపాధి పనులను పరిశీలించారు. రెండు పూటలా ఉపాధి పనులు జరగాలని, వేసవికి తగ్గ ఏర్పాట్లు చేయాలన్నారు. తదనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏపిఓ శ్రీనివాసరావు ఉన్నారు.

ఉపాధి మస్టర్ల వెరిఫికేషన్

సీతంపేట: మండలంలోని మెట్టుగూడలో జరుగుతున్న టెర్రాసింగ్ పనులకు ఉపాధి మస్టర్ల వెరిఫికేషన్ బుధవారం ఎంపీడీఓ కె.సత్యం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనులు పకడ్బందీగా చేయాలన్నారు. వేతనదారులు ఎండవేడిమి ఎక్కువగా ఉన్నందున తగు జాగ్రత్తలు పాటించాలన్నారు.

వైద్య సేవలు అందించడం ఓ వరం

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు



ఫ్యామిలీ డాక్టర్ వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు

పార్వతీపురంటౌన్: గ్రామాల్లో వైద్య సేవలు అందిచడం ఓ వరమని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. బుధవారం మండలంలోని బాలగుడబ గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య పరీక్షలకు మంచి స్పందన వస్తోందన్నారు. వైద్యశిబిరంలో అన్ని రకాల వైద్యపరీక్షలను నిర్వహిస్తున్నామని చెప్పారు. అందుబాటులో 62రకాల మందులు ఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్లవద్దనే వైద్యసేవలను అందిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానంలో రోగులను కుటుంబ సభ్యుల్లా చూస్తున్నామని, రోగాల బారినపడి గ్రామాల్లో ఏ ఒక్కరూ ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. వైద్యాధికారి శ్రీకాంత్, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.

గర్భస్రావం, గర్భనిరోధక పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలి

గర్భస్రావం, గర్భ నిరోధక పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ బి.వాగ్దేవి వైద్యాధికారులకు సూచించారు. ఈ మేరకు బుధవారం జిల్లా ఆస్పత్రిలో గర్భస్రావం, గర్భ నిరోధక పద్ధతులపై శిక్షణ పొందిన వైద్యాధికారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ సురక్షితమైన నిబంధనలతో కూడిన పద్ధతుల ద్వారా గర్భస్రావం, గర్భనిరోధక పద్ధతులు అనుసరించాలని సూచించారు.

నేడు ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు కౌన్సెలింగ్

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల జూనియర్ బాలికలు, బాలురు కళాశాల, పెద్దమడి కళాశాలలో ఇంటర్మీడియట్‌లో వివిధ గ్రూపుల్లో ప్రవేశానికి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఏపీఆర్ బాలుర కళాశాలలో నిర్వహించే కౌన్సిలింగ్‌కు విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిందే..

పాలకొండ: వాహనదారులందరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ శివప్రసాద్ సూచించారు. నగరపంచాయతీలో పలు కూడళ్ల వద్ద బుధవారం ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లుకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. నిబంధనలు అతిక్రమించేవారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు

పాలకొండ: పాలకొండ-శ్రీకాకుళం రహదారిలో బైక్‌పై వెళుతున్న యువకుడిని వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నీలకంఠం అనే యువకుడికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడుని స్థానికులు శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై ఎస్‌ఐ శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి రామాలయ ప్రతిష్ఠోత్సవాలు

జియ్యమ్మవలస: మండలంలోని బిత్రపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారాముని ఆలయం, ఆంజనేయస్వామి విగ్రహం, శ్రీపోతులూరి వీరబ్రహ్మం గారి మఠం ప్రతిష్ఠోత్సవాలు గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వంచనున్నట్లు గ్రామ సర్పంచ్ గుంట్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు. గ్రామస్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై తర్ఫీదు

పాలకొండ రూరల్: స్థానిక శాఖాగ్రంథాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు బుధవారం ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఫ్యాషన్ డిజైనింగ్ కోర్స్ డైరెక్టర్ అల్లు ప్రియాంక వస్త్రాలపై పెయింటింగ్ వేయడంపై శిక్షణ ఇచ్చారు. ఇన్‌చార్జి గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు పేరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. రానున్న వర్షాకాలంలో ఇంటి వద్ద కాయగూరలు, పలు రకాల పూల మొక్కల పెంపకంలో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు ఈశ్వరరావు పాల్గొన్నారు.

ముగిసిన గ్రామదేవత సంబరాలు



గ్రామదేవతకు ఘటాలు సమర్పిస్తున్న మహిళలు

భామిని: మండలంలోని నేరడి-బి గ్రామంలో జరుగుతున్న గ్రామదేవత సంబరాలు బుధవారంతో ముగిశాయి. గ్రామంలోని బంగారమ్మతల్లికి మహిళలు సామూహికంగా ముర్రాటలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా గ్రామంలో మేళతాళాల మధ్య ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. సంబరాల సందర్భంగా గ్రామంలో సందడి నెలకొంది.

వైద్యాధికారులు ఆస్పత్రుల్లో అందుబాటులో ఉండాలి

- ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్



హాజరు పట్టికని పరిశీలిస్తున్నా పీఓ విష్ణుచరణ్

కొమరాడ: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులు కచ్చితంగా అందుబాటులో ఉండాలని, లేదంటే వారిపై చర్యలు తప్పవని ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెళ్లే సమయానికి వైద్యాధికారులు ఆస్పత్రిలో అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. హాజరు పట్టీలో సంతకాలు ఉన్నప్పటికీ ఆస్పత్రిలో లేకపోవడంతో వైద్యాధికారులు ఎక్కడకి వెళ్లారని సిబ్బందిని ప్రశ్నించారు. పీఓ తనిఖీకి వచ్చిన విషయం తెలుసుకుని డాక్టర్ సీహెచ్ అరుణ్‌కుమార్ అక్కడకు చేరుకుని ఆన్‌లైన్ హాజరును పీఓకు చూపించారు. రెండో వైద్యాధికారి ఉదయ్‌కుమార్ ఎక్కడకు వెళ్లారని ఆయన్ను ప్రశ్నించగా.. ఆయన తరచూ విధులకు గైర్హాజరు అవుతున్నారని, ఈ విషయాన్ని జిల్లా వైద్యాధికారికి నివేదిక అందజేసినట్లు తెలిపారు. అనంతరం ఆస్పత్రిలో వార్డులు, ఓపీ రికార్డులను పీఓ తనిఖీ చేశారు. నాడు-నేడు అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

నవధాన్యాల కిట్లు పంపిణీ



తాడికొండ ఆర్బీకేలో రైతులకు నవధాన్యాల కిట్లను అందజేస్తున్న సీతారాం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ ఆర్బీకేకు చెందిన 35 మంది రైతులకు, లుంబేసు ఆర్బీకేకు చెందిన 30 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌ఛార్జ్ ఎం.సీతారాం బుధవారం నవధాన్యాల విత్తనాల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమి సారవంతం అవుతుందన్నారు. ప్రధాన పంటలకు కావాల్సిన సూక్ష్మ, స్థూల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయన్నారు. ఏవిధమైన రసాయన ఎరువులు వాడాల్సిన అవసరం లేకుండానే దిగుబడిని పెంచుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు నవీన్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా భూసర్వే నిర్వహించాలి

- జేసీ ఆర్.గోవిందరావు



భూముల రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ గోవిందరావు, సబ్‌కలెక్టర్ నూరల్ కమర్

గుమ్మలక్ష్మీపురం: భూముల రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు అన్నారు. మండలంలోని ఎగువ తాడికొండ గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వేను బుధవారం ఆయన పరిశీలించారు. సర్వే ఎంతవరకు పూర్తయిందని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సర్వే సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. భూ యజమానుల సమస్యలను పరిష్కరించాలని, నిర్దేశించిన సమయంలోగా సర్వే పూర్తిచేయాలని సూచించారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ నూరల్ కమర్, తహసీల్దార్ జె.రాములమ్మ, సర్వేయర్ రమణమూర్తి, సర్పంచ్ ఎం.జగ్గారావు ఉన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రం ప్రారంభం



సేంద్రియ ఎరువులు తయారు చేస్తున్న రైతుఉత్పత్తి సంఘం సభ్యులు

గరుగుబిల్లి: సేంద్రియ ఎరువుల తయారీ కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జట్టు ట్రస్ట్ డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లిలో ఉన్న ప్రకృతి ఆదిదేవోభవ ప్రాంగణంలోని జట్టు నూతన కార్యాలయ ప్రాంగణంలో సేంద్రియ ఎరువులైన ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య, వర్మీకంపోస్టు తదితర ఎరువుల తయారీ కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వినియోగించి సాగు చేసిన పంటలు ఆరోగ్యానికి మంచివని, ఈ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. రైతులు సేంద్రియ సాగు విధానంలో పంటలు సాగు చేసేందుకు ఆసక్తి చూపాలని కోరారు. ఘన జీవామృతంను కిలో రూ.13లు, వర్మీకంపోస్టు కిలో రూ.16లు చొప్పున్న అన్నపూర్ణేశ్వరీ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వారా విక్రయించేందుకు ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే ఆవు పచ్చిపేడను కిలో ఒక రూపాయికి, ఆవు మూత్రాన్ని లీటర్ రూ.5లకు రైతు ఉత్పత్తిదారుల సంఘం కొనుగోలు చేస్తుందని తెలిపారు.

అభాగ్యులకు అండగా సీఎం సహాయనిధి



బాధితురాలికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కళావతి

వీరఘట్టం: ముఖ్యమంత్రి సహాయనిధి అభాగ్యులకు అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని నడుకూరు గ్రామానికి చెందిన బొబ్బాది చంద్రశేఖర్ కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ కుటుంబ ఆర్థిక పరిస్థితులను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్మెల్యే కళావతికి దృష్టికి తీసుకువెళ్లగా.. ఆమె వెంటనే స్పందించి సీఎంతో మాట్లాడి ఆ కుటుంబం పరిస్థితిని వివరించారు. ప్రభుత్వం సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షలును మంజూరు చేయడంతో ఆ మొత్తాన్ని బుధవారం వండవలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మృతుని భార్య సీతాలక్ష్మికి అందజేశారు. ఎమ్మెల్యేతో పాటు మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కర్రి లీలాప్రసాదరావు ఉన్నారు.

మినీ గురుకులాల్లో ప్రవేశాలకు లాటరీ



లాటరీ ద్వారా ఎంపికలు చేస్తున్న ప్రిన్సిపాళ్లు

సీతంపేట: స్థానిక గిరిజన గురుకుల బాలుర కళాశాలలో బుధవారం మినీగురుకుల పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు లాటరీ ద్వారా ఎంపికలు నిర్వహించారు. కారిగూడ, సీతంపేట పాఠశాలల్లో ఒక్కో పాఠశాలలో 30 చొప్పున సీట్లు ఖాళీగా ఉన్నాయి. వాటిలో ప్రవేశాలకు 120 అప్లికేషన్లు వచ్చాయి. లాటరీలో నిర్వహించారు. కార్యక్రమంలో గురుకులం సెల్ ఇన్‌చార్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాళ్లు పి.నాగభూషణరావు, రేణుకేశ్వరరావు, మినీగురుకులాల ఇన్‌చార్జ్‌లు ఎస్.హేమలత, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.